క్లుప్తంగా

నేడు కేవీ 15వ స్పోర్ట్స్ డే

కాజీపేట అర్బన్ : కాజీపేట మండలం కడిపి కొండ గ్రామంలోని పీఎం శ్రీ కేంద్రియ విద్యాలయ 15వ వార్షిక స్పోర్ట్స్‌డే వేడుకలను బుధవారం నిర్వహిస్తున్నట్లు మంగళవారం కేవీ ప్రిన్సిపాల్ సుభాషిణి ఒక ప్రకటనలో తెలిపారు. వేడుకలకు ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్, కేవీ విద్యాలయ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్‌పర్సన్ సిక్తా పట్నాయక్ పాల్గొననున్నట్లు తెలిపారు. నిట్ స్పోర్ట్స్ ఆఫీసర్ డి.హరి పాల్గొని విద్యార్థులకు క్రీడాస్ఫూర్తిని అందించేందుకు సందేశం అందించనున్నట్లు తెలిపారు.

20న పెన్షనర్స్ డే

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీలో రిటైర్డ్ బోధనేతర ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఈనెల 20న (విశ్రాంత ఉద్యోగుల) పెన్షనర్స్ డేను నిర్వహించనున్నట్లు కేయూ రిటైర్డ్ నాన్ టీచింగ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ ఎస్. సంజీవరావు, జనరల్ సెక్రటరీ నాగేశ్వర్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి కేయూ వీసీ తాటికొండ రమేష్, రిజిస్ట్రార్ టి.శ్రీనివాస్‌రావు పాల్గొంటారని వారు తెలిపారు.

వైద్యఆరోగ్య శాఖ మంత్రిని కలిసిన కాంగ్రెస్ నేతలు



హసన్‌పర్తి: రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన దామోదర్ రాజనర్సింహను జిల్లా కాంగ్రెస్ నేతలు కలిశారు. మంగళవారం కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పింగిలి వెంకట్రామ్‌రెడ్డి, పీసీసీ అధికారి ప్రతినిధి బండి సుధాకర్ బోకే అందించి శుభాకాంక్షలు తెలిపారు.

ఎమ్మెల్యేను కలిసిన కాంగ్రెస్ నేతలు

మడికొండ: వర్ధన్నపేట ఎమ్మెల్యే కర్పన్ నాగరాజును మంగళవారం మడికొండకు చెందిన పార్టీ నాయకులు హన్మకొండ సుబేదారిలోని తన క్యాంప్ కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువతో సన్మానించారు. అనంతరం గ్రామంలోని సమస్యలను తీర్చాలని సూచించారు. ముఖ్యంగా మడికొండ శివారులోని డంపింగ్ యార్డుపై తక్షణ చర్యలు తీసుకొని ప్రజల ప్రాణాను కాపాడాలని కోరారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో మడికొండ గ్రామ కాంగ్రెస్ నాయకులు బైరి లింగమూర్తి, కుర్ల మోహన్, కృష్ణారెడ్డి, సాయిలు, రాజు యాదవ్, సంపత్‌రెడ్డి, రమేష్, ఉన్నారు.

ఎమ్మెల్యేలకు రెడ్డి సంఘం సన్మానం

హన్మకొండ అర్బన్: నూతనంగా ఎమ్మెల్యేలుగా గెలుపొందిన పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి, నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిలను మంగళవారం వారి నివాసాల్లో మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శాలువా, పుష్పగుచ్ఛంతో సత్కరించారు. కలిసిన వారిలో రాష్ట్ర నాయకులు గోపు జైపాల్‌రెడ్డి, సంఘం జిల్లా అధ్యక్షుడు అర్జుల కిషన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యే నాగరాజుకు టీజీఓల అభినందనలు



హన్మకొండ అర్బన్: వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజును గెజిటెడ్ అధికారుల సంఘం నాయకులు మంగళవారం సుబేదారిలోని ఎమ్మెల్యే నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. సంఘం అధ్యక్షుడు ఎన్నమనేని జగ్మోహన్‌రావు, రాజేశ్, డాక్టర్ ప్రవీణ్. మురళీధర్‌రెడ్డి, శ్రీనివాస్, సురేష్ తదితరులు ఉన్నారు.

'భట్టి'ని కలిసిన టీఎస్ ఈఈయూ నేతలు



హన్మకొండ : తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (టీఎస్ఈఈయూ)-327 నాయకులు కలిశారు. మంగళవారం రాత్రి హైదరాబాద్‌లో టీఎస్ఈఈయూ-327 రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఇనుగాల శ్రీధర్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రభాకర్, టీఎస్ ఎస్పీడీసీఎల్ కార్యదర్శి కె.భూపాల్ రెడ్డి, ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.సీతారం గోపాల్, నాయకులు గోపాలకృష్ణ, కె.శ్రీనివాస్, రమేశ్‌బాబు, అభిలాష్‌లు భట్టిని కలిసి శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందించి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

నీళ్లు కావాలంటూ ఆందోళన

- మిషన్ భగీరథ కార్యాలయం ఎదుట ధర్నా
- విధులకు వెళ్లకుండా ఇబ్బందులు పడిన ఉద్యోగులు
- వారంలో నీటి సమస్య పరిష్కరిస్తామని అధికారుల హామీ



ధర్నా చేస్తున్న డబుల్‌బెడ్రూం ఇళ్ల లబ్ధిదారులు



కార్యాలయం బయట నిలబడిన ఉద్యోగులు

హసన్‌పర్తి : మాకు నీళ్లు కావాలంటూ డబుల్ బెడ్రూం ఇళ్ల లబ్ధిదారులు ఆందోళనకు దిగారు. హసన్‌పర్తిలోని మిషన్ భగీరథ సర్కిల్ కార్యాలయం ఎదుట మంగళవారం ఈ ఆందోళన సాగింది. సుమారు గంట పాటు లబ్ధిదారులు కార్యాలయ ప్రధాన గేట్ ముందు ధర్నాకు దిగారు. విధులకు వచ్చిన ఉద్యోగులు గంట పాటు లోపలికి వెళ్లకుండా బయటనే నిరీక్షించాల్సి వచ్చింది.

మండలంలోని సిద్ధాపురంలో ఏడాదిన్నర క్రితం 52 డబుల్‌బెడ్రూం ఇళ్ల లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సమయంలో ఆ కాలనీలో తాగు నీటి వసతి కల్పించలేదు. గ్రామపంచాయతీ ద్వారానే ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేశారు. నిధులు లేకున్నా స్థానిక సర్పంచ్ ధనలక్ష్మి ఈ ఖర్చును భరిస్తూ వచ్చారు. ఓ వైపు డీజిల్‌కు నిధులు లేక మరో వైపు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోకపోవడంతో నెల క్రితం ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా నిలిపివేశారు. చివరికి జిల్లా కలెక్టర్ వద్దకు సమస్య తీసుకెళ్లగా ప్రత్యేక నిధులు కేటాయించారు. పైపులైన్ ఏర్పాటు చేసినప్పటికీ అధికారులు కనెక్షన్ ఇవ్వడానికి నిరాకరిస్తూ వచ్చారు. దీంతో నీటి సమస్య తీవ్రమైంది. గత్యంతరం లేక కాలనీవాసులు ప్రైవేట్‌గా కొనుగోలు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది.

భగీరథ ప్రధాన కార్యాలయం ఎదుట ధర్నా

చివరికి సర్పంచ్ ధనలక్ష్మి, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు జనగాని కిరణ్ ఆధ్వర్యంలో డబుల్‌బెడ్రూం లబ్ధిదారులకు మిషన్ భగీరథ కార్యాలయం ముందు ధర్నాకు దిగడంతో ఉద్యోగులు ఇబ్బందులు పడ్డారు. ఈ సందర్భంగా ఉద్యోగులు, ఆందోళనకారుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. పంచాయతీ కార్యాలయం ముందు ధర్నా చేసుకోవాలని అధికారులు సూచించారు. స్థానిక పోలీసులు సంఘటన స్థలాన్ని చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఆందోళనకారులను శాంతింపజేయడానికి ప్రయత్నించినప్పటికీ వారు వినలేదు.

వారం రోజుల్లో పరిష్కారం

వారం రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని తెలిపారు. రెండు రోజుల్లో పనులు ప్రారంభిస్తామని, నిధులు లేనప్పటికీ సొంత ఖర్చుతో పనులు చేయిస్తానన్నారు. దీంతో ఆందోళనకారులు శాంతించారు. -సునీత, డీఈఈ

16న గిరిజన ఎమ్మెల్యేలకు ఆత్మీయసత్కారం



సమావేశంలో మాట్లాడుతున్న వీరన్ననాయక్

కేయూ క్యాంపస్ : గిరిజన ఉద్యోగుల, ప్రజాసంఘాలు, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 16న ఉదయం 10 గంటలకు హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో గిరిజన ఎమ్మెల్యేలకు ఆత్మీయ సత్కారం నిర్వహించనున్నట్లు కాకతీయ యూనివర్సిటీ పొలిటికల్ సైన్స్ విభాగం రిటైర్డ్ ఆచార్యులు గుగులోతు వీరన్ననాయక్ తెలిపారు. మంగళవారం కాకతీయ యూనివర్సిటీలో గిరిజన ఉద్యోగుల, అధ్యాపకుల, విద్యార్థి సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రిగా ధనసరి సీతక్కకు అవకాశం కల్పించటం అభినందనీయమన్నారు. సీతక్కతో సహా మిగితా గిరిజన ఎమ్మెల్యేలకు ఆత్మీయ సత్కారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లుభట్టి విక్రమార్క ముఖ్యఅతిథులుగా పాల్గొంటారన్నారు. సమావేశంలో యూనివర్సిటీ కాలేజి ప్రిన్సిపాల్ ఆచార్య బి.సురేష్‌లాల్, డాక్టర్ రమేష్, దేవేందర్‌జాదవ్, మహేష్, నెహ్రూచంద్,హనుమంతు, యాదగిరి, రమేష్, దేవేందర్, విష్ణు, శారద, వనిత, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేలను కలిసిన ఉద్యోగ సంఘాల నేతలు



ఎమ్మెల్యే నాగరాజుకు అభినందనలు తెలుపుతున్న ఉద్యోగ సంఘాల నేతలు

ఎంజీఎం : మేనిఫెస్టోలో పెట్టిన ఉద్యోగుల సమస్యలను త్వరలోనే సీఎం పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఉద్యోగ సంఘాల నేతలు ఎమ్మెల్యే నాగరాజు, దొంతి మాధవరెడ్డిలను కోరారు. ఎమ్మెల్యేలుగా వారిని జేఏసీ గౌరవ అధ్యక్షుడు సాంబశివరావు ఆధ్వర్యంలో పూలబొకేలు అందించి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ సాంబశివరావు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు ఒకటవ తేదీన జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని, పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలు ప్రకటించాలన్నారు. ఈ కుబేర్‌లో ఉన్న పెండింగ్ బిల్లులు క్లియర్ చేయించాలని మిగతా అన్ని సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లాలని ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో జీపీఏ స్టేట్ ప్రెసిడెంట్ బత్తిని సుదర్శన్‌గౌడ్, ప్రమోద్, బ్రహ్మయ్య, వివిధ ఉద్యోగ సంఘాల నేతలు తదితరులు పాల్గొన్నారు.

రైతు సంఘాల నాయకులపై కేసులు ఎత్తివేయాలి



కలెక్టరేట్ ఏఓ శ్రీకాంత్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘాల నాయకులు

కరీమాబాద్: కేంద్ర ప్రభుత్వం జాతీయ రైతు సంఘాల నాయకులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం రైతు సంఘాల నాయకులు కలెక్టరేట్ ఏఓ శ్రీకాంత్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో కరోనా సమయంలో కేంద్రంలోని మోడీ ప్రభుత్వం మూడు రైతు వ్యతిరేక చట్టాలను తీసుకురావడంతో దేశ రైతు సంఘాలన్నీ సంయుక్తంగా కిసాన్‌మోర్చా ఆధ్వర్యంలో 13 నెలలు పోరాటాలు చేయగా రద్దు చేసినప్పటికీ ఉద్యమంలో పాల్గొన్న రైతు సంఘాల జాతీయ నాయకులపై కుట్రపూరితమైన నిర్బంధాలు, విదేశాలకు వెళ్లకుండా నిషేధించిందని తెలిపారు. రైతు సంఘాల నాయకులకు ఇచ్చిన హామీ ప్రకారం కేసులు ఉపసంహరించుకోవాలని పేర్కొన్నారు. ఏఓను కలిసిన వారిలో రైతు సంఘాల నాయకులు వీరగోని శంకరయ్య, రాచర్ల బాలరాజు, చిర్ర సూరి, వల్లందాస్ కుమార్, పాణి, వెంకటేశ్వర్‌రావు తదితరులు ఉన్నారు.

గుంతలు పూడ్చిన ట్రాఫిక్ పోలీసులు



వరంగల్ క్రైం : వరంగల్ హెడ్‌పోస్టాఫీసు జంక్షన్‌లో ఏర్పడిన ప్రమాదకరమైన గుంతలను ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకన్న ఆధ్వర్యంలో మంగళవారం పోలీసులు శ్రమదానం చేసి పూడ్చివేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు స్టేషన్ రోడ్డు హెడ్‌పోస్టాఫీసు జంక్షన్‌లో గుంతలు ఏర్పడ్డాయి. ఈగుంతలో పడి ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. వాహనదారుల అభ్యర్థన మేరకు మంగళవారం ట్రాఫిక్ సీఐ వెంకన్న స్పందించి శ్రమదానం చేసి గుంతలు పూడ్చివేశారు. పోలీసులు స్పందించిన తీరుపై స్థానిక ప్రజలు, వాహనచోదకులు అభినందించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీసులు,హోంగార్డులు పాల్గొన్నారు.

టీచర్ల సమస్యలు పరిష్కరించాలి



ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న పీఆర్‌టీయూ జిల్లా, మండల బాధ్యులు

విద్యారణ్యపురి : విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేలా కృషి చేయాలని పీఆర్‌టీయూ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మంద తిరుపతిరెడ్డి, జనరల్ సెక్రటరీ ఫలితశ్రీహరి ఇతర బాధ్యులు మంగళవారం హనుమకొండలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేశారు. రాజేందర్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి శాలువతో సన్మానించి పూలబొకేను అందించి శుభాకాంక్షలు తెలిపారు. పీఆర్‌టీయూ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డికి, ప్రభుత్వానికి పీఆర్‌టీయూ సహకారాన్ని అందిస్తుందన్నారు. కలిసిన వారిలో పీఆర్‌టీయూ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు ఆర్. భానుప్రసాద్‌రెడ్డి, ఇతర బాధ్యులు అజిత్‌కుమార్, జి.సమ్మయ్య, ఉపేందర్‌రెడ్డి, శ్రీనివాసస్వామి, మాలకొండారెడ్డి, రఘోత్తమ్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, శ్రీధర్‌స్వామి, పటేల్ శ్రీనివాస్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

చదువుకుంటూనే బోధించడం అభినందనీయం



పుస్తకాలను ప్రదర్శిస్తున్న ప్రేరణ ఫౌండేషన్ బాధ్యులు ఉపేందర్‌రెడ్డి

విద్యారణ్యపురి: డిగ్రీ చదువుతూనే ప్రతి శనివారం ప్రాథమిక స్థాయి విద్యార్థులకు విద్యాబోధన చేయడం ప్రశంసనీయమని విద్యావికాస ప్రేరణ ఫౌండేషన్ అధ్యక్షుడు పి.ఉపేందర్‌రెడ్డి అన్నారు. హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కొందరు ఎన్ఎస్ఎస్ వలంటీర్ల పిల్లల కోసం కార్యక్రమంలో భాగంగా ప్రాథమిక పాఠశాల స్థాయి విద్యార్థులకు తమకు వారంలో వీలైన ఒకరోజు విద్యాబోధన చేస్తున్నారు. అయితే వీరికి ఆయా ప్రాథమిక స్థాయికి సంబంధించిన విద్యాబోధనకు అవసరమైన పలు రకాల పుస్తకాలను మంగళవారం కేడీసీలోని ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు కొందరికి విద్యావికాసం ప్రేరణ ఫౌండేషన్ బాధ్యులు పలు పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యాభివృద్ధికి తగిన చేయూతనిస్తామని మీకు సహకారం అందిస్తామని ఉపేందర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ బాధ్యులు బి.రామచంద్రం, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి రాజారెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ సురభి వినోద్‌రావు, డాక్టర్ ఇందిరా నయనాదేవి, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

గుడిసెవాసులకు పట్టాలు ఇవ్వాలి

హసన్‌పర్తి: సర్కార్ స్థలాల్లో గుడిసెలు వేసుకున్న నిరుపేదలకు ఇళ్ల పట్టాలతో పాటు గృహలక్ష్మి పథకం కింద రూ. 5 లక్షలు మంజూరు చేయాలని సీపీఎం జిల్లా కన్వీనర్ బొట్ల చక్రపాణి డిమాండ్ చేశారు. నగరంలోని పలివేల్పులకు చెందిన సీపీఎం (ఎంఎల్) పార్టీకి చెందిన కార్యకర్తలు భారీ సంఖ్యలో సీపీఎంలో చేరారు. ఈ సందర్భంగా చక్రపాణి వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గుడిసెల కాలనీల్లో కనీస సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పేర్కొన్న ఆరుగ్యారంటీ కార్డులను అమలు చేయాలన్నారు.

ప్లాట్ల కేటాయింపుల్లో అన్యాయం జరిగింది

- అర్హులను గుర్తించాలని డీడీఎంకు వినతి



డీడీఎంకు వినతిపత్రం ఇస్తున్న చిరువ్యాపారులు

వరంగల్ : వరంగల్ లక్ష్మీపురంలో మోడల్ మార్కెట్‌లో జరిగిన ప్లాట్ల కేటాయింపుల్లో అన్యాయం జరిగిందని మార్కెట్‌లోని చిరువ్యాపారులు మార్కెటింగ్ శాఖ డీడీఎం రాజునాయక్‌కు ఫిర్యాదు చేశారు. మంగళవారం ఆయనకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా చిరువ్యాపారులు మాట్లాడుతూ లక్ష్మీపురం పాత మార్కెట్ మోడల్ కూరగాయల మార్కెట్‌లోకి షిఫ్టింగ్ సమయంలో అర్హులైన మాకు ప్లాట్లు కేటాయించలేదన్నారు. కొంత మంది కమీషన్ దుకాణదారులకు అదనంగా కుటుంబ సభ్యుల పేర్లతో ఓపెన్ ప్లాట్లు కేటాయించారని ఫిర్యాదు చేశారు. అర్హులు కాని వివరాలు గతంలో మీకు, మార్కెట్ కార్యదర్శి బీవీ.రాహుల్‌లకు అందజేశామన్నారు. అర్హులకు ప్లాట్లు ఇవ్వడం లేదని, అదనంగా ప్లాట్లు పొందారంటూ పలు దినపత్రికల్లో కథనాలు వచ్చినా పట్టించుకోలేదన్నారు. ఆరు నెలల నుంచి మార్కెట్ కార్యదర్శి చుట్టూ మాకు న్యాయం చేయాలని ప్రదక్షిణలు చేస్తున్నా పట్టించుకోలేదన్నారు. అర్హులకు ఓపెన్ ప్లాట్లు కేటాయించాలంటూ బుధవారం కూరగాయల మార్కెట్ ఎదుట చిరువ్యాపారులందరం కలిసి శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్నామని తెలిపారు. డీడీఎంకు వినతి ప్రతం సమర్పించిన వారిలో బూర ప్రకాష్, ప్రసాద్, కంచి రాజ్‌కుమార్, నాగరాజు, గోపాల్, సురేష్, రహీం, శ్యాంలు పాల్గొన్నారు.

అభయాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

ఖిలావరంగల్: కార్తీక మాసం, అమావాస్య చివరి మంగళవారం సందర్భంగా వరంగల్ విశ్వనాథకాలనీలోని శ్రీఅభయాంజనేయస్వామి దేవాలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ పూజారి కోటయ్య శర్మ, ఆలయ చైర్మన్ కర్నె రవీందర్ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా అభయాంజనేయ స్వామి అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సంక్షిప్త సమాచారం

సామాజికాభివృద్ధిలో భాగస్వాములు కావాలి

కేయూ క్యాంపస్: జాతీయ సేవాపథకం (ఎన్ఎస్ఎస్) వలంటీర్లు సామాజిక సేవాదృక్పథంలో సామాజికాభివృద్ధిలో భాగస్వాములు కావాలని కాకతీయ యూనివర్సిటీ ఫార్మసీ కళాశాల ప్రొఫెసర్, అంబేద్కర్ స్టడీసెంటర్ మాజీ డైరెక్టర్ గాదె సమ్మయ్య కోరారు. మంగళవారం ఫార్మసీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో వలంటీర్లు శ్రమదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు.

విద్యార్థి దశ నుంచే ఎదగాలి

విద్యారణ్యపురి: విద్యార్థులు విద్యార్థి దశ నుంచే ఉన్నతంగా ఎదగాలని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, రిటైర్డ్ డీఎస్పీ దామెర నర్సయ్య అన్నారు. మంగళవారం సుబేదారి ప్రభుత్వ హై స్కూల్‌లో అసోసియేషన్, ఓరుగల్లు కన్స్యూమర్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సంస్కార వికాస శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఓరుగల్లు కన్స్యూమర్ ప్రొటెక్షన్ కౌన్సిల్ అధ్యక్షుడు దామోదర్ మాట్లాడారు.

పద్మశాలి సంక్షేమానికి కృషి చేయాలి

ఖిలా వరంగల్ : పద్మశాలి కులస్తుల సంక్షేమానికి మరింత కృషి చేయాలని మంత్రి కొండా సురేఖను పోపా రాష్ట్ర అధ్యక్షుడు శామంతుల శ్రీనివాస్ కోరారు. ఇటీవల బాధ్యతలు చేపట్టిన రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావును మంగళవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశామని తెలిపారు. అనంతరం మంత్రికి వినతిపత్రం అందజేసి పద్మశాలిల అభ్యున్నతికి మరింతగా కృషి చేయాలని కోరానని తెలిపారు.

ముగిసిన అయ్యప్ప ఇరుముడి ధారణ

కాజీపేట: కాజీపేట స్వయంభూ శ్రీ శ్వేతార్కమూలగణపతి దివ్య క్షేత్రం ఆవరణలో కొలువుదీరిన హరిహరపుత్ర అయ్యప్పస్వామి ఆలయంలో మంగళవారం ఘనంగా ఇరుముడి ధారణ కొనసాగింది. అయ్యప్ప దీక్షలు స్వీకరించిన భక్తులకు గురుస్వాముల ఆధ్వర్యంలో శబరిమలకు బయలుదేరుతున్న 25 మంది స్వాములకు ఇరుముడి ధారణ చేశారు.

కల్లుగీత కార్మిక సంఘం కార్యవర్గం

కాజీపేట : పట్టణంలో హనుమకొడ జిల్లా కల్లుగీత కార్మిక సంఘం జిల్లా నూతన కార్యవర్గాన్ని మంగళవారం సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎంవీ రమణ, బెల్లంకొండ వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు నూతన కమిటీకి ఎన్నికలు నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా గౌని సాంబయ్య గౌడ్, ప్రధాన కార్యదర్శిగా బుర్ర శ్రీనివాస్ గౌడ్‌లు ఎన్నికయ్యారు. గౌరవ సలహాదారుడిగా డాక్టర్ తిరుపతిగౌడ్, మోడెం రాజేందర్, మోటపోతుల రవీందర్, ఉపాధ్యక్షులుగా బుర్ర సుధాకర్, జనగాం భిక్షపతి, కోతి సాంబరాజు, మార్క జితేందర్, బత్తిని నాగరాజు, తదితరులతో పాటు కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం

ఖిలా వరంగల్: కార్తీక మాసోత్సవం సందర్భంగా వరంగల్ శివనగర్‌లోని శ్రీ షిరిడి సాయి బాబా దేవాలయంలో మంగళవారం ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఆలయ పూజారి నవీన్ నేతృత్వంలో శివపార్వతుల కల్యాణం వైభవంగా నిర్వహించారు.

సమస్యల పరిష్కారానికి కృషి



కాజీపేట: రైల్వే రిటైర్డ్ పెన్షనర్స్ ఎదుర్కొంటున్న అనేక అపరిష్కృత సమస్యల పరిష్కారానికి చేయూతనందిస్తానని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. స్థానిక రైల్వే రిటైర్డ్ పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఎమ్మెల్యేను పెన్షనర్స్ ఘనంగా సన్మానించారు.

పలు కార్యక్రమాల్లో ఎమ్మెల్యే

హన్మకొండ అర్బన్: వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మంగళవారం పలు కార్యక్రమాల్లో పాల్గొని బీజీ బీజీగా గడిపారు. వడ్డేపల్లిలోని పోచమ్మ దేవాలయంలో కార్పొరేటర్లతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి పోస్టల్ కాలనీలోని అభయాంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేకపూజల్లో పాల్గొన్నారు. అనంతరం ఆలయ అభివృద్ధి కమిటీ, కాలనీ కమిటీ సంయుక్తంగా నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో పాల్గొన్నారు. హన్మకొండ బాలసముద్రంలోని మల్లికాంబ మనోవికాస కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన దివ్యాంగుల క్రీడోత్సవాల ముగింపు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మల్లికాంబ కేంద్రానికి తన వంతు సహకారం అందిస్తామని తెలిపారు. మల్లికాంబ సేవలను అభినందించారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

బస్సు సర్వీస్‌ను పునరుద్ధరించండి

హసన్‌పర్తి: మండలంలోని ముచ్చర్లకు బస్సు సర్వీస్‌ను పునరుద్ధరించాలని ఆ ప్రాంత ప్రజలు కోరారు. మంగళవారం వరంగల్ ఆర్ఎం శ్రీలతను కలిసి వినతిపత్రం అందించారు. ఇటీవల భారీ వర్షాల కారణంగా మిలీనియం స్కూల్ సమీపంలో కల్వర్ట్ దెబ్బతిన్నది. దీంతో బస్సు సర్వీస్‌లను నిలిపివేశారు. ప్రస్తుతం కల్వర్ట్ పనులు పూర్తయ్యాయన్నారు. నాలుగు నెలలుగా బస్సు సర్వీస్‌లు లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు.

ప్రత్యేక అలంకరణలో మహానందీశ్వరుడు

కాజీపేట : స్థానిక శ్రీభ్రమరాంభిక మల్లికార్జునస్వామి దేవాలయంలో మంగళవారం అర్చకులు మహానందీశ్వర పూజలను ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన పూజారి ఐనవోలు ప్రవీణ్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో భక్తులు మహాదేవుడి వాహనం అయిన నందీశ్వరుడిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. కార్యక్రమంలో అర్చకులు శ్రీనివాస్ శర్మ, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆలయంలో చండీహోమం

కాశిబుగ్గ : స్థానిక శ్రీ రంగనాథస్వామి దేవాలయంలో కార్తీకమాసం ముగింపును పురస్కరించుకుని మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఆలయంలో చండీహోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం భక్తులకు మహాన్నదానం చేశారు. పూజా కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు వంగరి రవి, ప్రధాన కార్యదర్శి చిలుపూరి సురేష్, కోశాధికారి సుల్తానా సమ్మక్క, అర్చకులు పాల్గొన్నారు.

శ్రీఅయ్యప్ప స్వామికి పల్లకీసేవ



ఖిలావరంగల్ : వరంగల్ అండర్ బ్రిడ్జి పెరుకవాడలోని ఫోర్ట్‌రోడ్డుపై శ్రీహరిహర పుత్ర అయ్యప్ప భక్త మండలి ఆధ్వర్యంలో మంగళవారం అయ్యప్పస్వామి సంకీర్తన, స్వామిపల్లకి సేవ ఊరేగింపు శాస్త్రోక్తంగా నిర్వహించారు. మహిళలు పెద్ద ఎత్తున మంగళహారతులతో స్వామి వారి ఊరేగింపుకు ఎదురేగి నీళ్ల ఆరబోసి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు సమర్పించారు.

మినీ క్రిస్మస్ వేడుకలు

కాజీపేట: నగరంలోని 62వ డివిజన్ రహమత్‌నగర్ ప్యారడైజ్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం రాత్రి మినీ క్రిస్మస్ వేడుకలను డీసీసీబీ మాజీ చైర్మన్ జంగా రాఘవరెడ్డి ప్రారంభించారు. ది గెస్పల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా హార్మన్ గోస్పెల్ మినిస్ట్రీస్ మడికొండ ఆధ్వర్యంలో వేడుకలను లాంఛనంగా ప్రారంభించారు.

17 నుంచి శివానందమూర్తి జన్మదిన వేడుకలు



పోటీల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ట్రస్టీలు

వరంగల్: ములుగురోడ్డు సమీపంలోని సప్త గురుధామంలో పూజ్య సద్గురు శ్రీశ్రీశ్రీ కందుకూరి శివానందమూర్తి 95వ జన్మదినోత్సవ వేడుకలు డిసెంబర్ 17 నుంచి 20 వరకు నిర్వహించనున్నట్లు శివానందగురు కల్చరల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ త్రిపురనేని గోపీచంద్ తెలిపారు. మంగళవారం గురుధామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వేడుకల్లో భాగంగా రాష్ట్రస్థాయి సంగీత, నృత్య, పేరిణీ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే వారు బండారు సాయినారాయణ సెల్ నంబర్ 98484 23133లో సంప్రదించాలని సూచించారు. మరో ట్రస్ట్ బండారు సాయినారాయణ మాట్లాడుతూ ఈ వేడుకలకు దేశ విదేశాల నుంచి భక్తులు, సీనియర్ ఐఏఎస్, ఐపీఎస్ ఆఫీసర్లు హాజరవుతున్నట్లు తెలిపారు. సమావేశంలో ట్రస్టీలు సోమరామయ్య, మాదారపు సదాశివుడు, గందె ఉమాశంకర్, రేపాల రామచందర్, ఎండీ.లాయక్ అహ్మద్ పాల్గొన్నారు.

కమలేష్ కమిటీ సిఫారసు అమలు చేయాలి



వరంగల్ డివిజన్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఉద్యోగులు

ఖిలా వరంగల్: తపాలాశాఖ జీడీఎస్ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, కమలేష్ చంద్ర కమిటీ సిఫార్సులను తక్షణమే అమలు చేయాలని ఆశాఖ జీడీఎస్, ఏఐజీ డీఎస్‌యూ, ఎన్‌యూ జీడీఎస్ డివిజన్ ఉద్యోగ సంఘాల అధ్యక్షుడు అప్పని రవీందర్, డి.ఉమేష్ డిమాండ్ చేశారు. కేంద్ర కమిటీల పిలుపు మేరకు మంగళవారం వరంగల్ స్టేషన్‌రోడ్డులోని తపాలాశాఖ డివిజన్ కార్యాలయం ఎదుట ఆల్‌ఇండియా గ్రామీణ డక్ సేవక్స్ యూనియన్, నేషనల్ యూనియన్ ఆఫ్ గ్రామీణ డక్ సేవక్స్ సంఘాల వరంగల్ డివిజన్ ఆధ్వర్యంలో ఉద్యోగులు నిరవధిక సమ్మెను చేపట్టారు.